క్లుప్తంగా

అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలి

మరికల్: ఇందిరమ్మ ఇళ్లను అర్హులందరికీ మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు నరసింహారెడ్డి, తిమ్మయ్యగౌడ్, నాగేష్‌గౌడ్ గురువారం సంయుక్త ప్రకటనలో కోరారు. పస్పుల గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లల్లో అర్హత ఉన్న వారికి కాకుండా అధికార పార్టీకి చెందిన నాయకులు ఎంపిక చేసిన వారికి మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు. అద్దె ఇళ్లలో ఉండి ఖాళీ స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు వచ్చినా ఇళ్లు మంజూరు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి పేదల సొంతింటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

నర్వ: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. గురువారం పెద్ద కడ్మూర్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్లంలో పట్టుసాధించేలా బోధన చేపట్టాలన్నారు. అలాగే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సంఖ్యను పెంచి బెస్ట్ పాఠశాలలుగా నిలిచిన పీఎస్ నాగిరెడ్డిపల్లి, పీఎస్ నర్వ, పీఎస్ బెక్కర్‌పల్లి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మీ, ఆర్పీలు ప్రదీప్, హరిశంకర్, రఘువర్మగౌడ్, సీఆర్పీ నర్సిములు, హెచ్ఎంలు సూరం వెంకటేష్, రాఘవ రెడ్డి, వేణుగోపాల్, జనార్దన్, వెంకటన్న, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాపూర్‌లో వైద్యశిబిరం



నారాయణపేట రూరల్: ప్రధానమంత్రి సమగ్ర హెల్త్ క్యాంపులో భాగంగా మండలంలోని తిరుమలాపూర్‌లో శుక్రవారం కోటకొండ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 90 మందికి బీపీ, షుగర్, టీబీ, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు కిష్టమ్మ తెలిపారు. వైద్య పరీక్షల్లో ఒకరికి హెచ్ఐవీ కేసు నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ దశరథ్, సిబ్బంది పాల్గొన్నారు.

112 మందికి వైద్యపరీక్షలు

కోస్గి రూరల్: గుండుమాల్ మండల పరిధిలోని భోగారం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో 112 మంది రోగులకు వివిధ వైద్యపరీక్షలు చేసి మందులు అందజేసినట్లు వైద్యులు తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాచి వడబోసిన నీటినే తాగాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు



కొత్తపల్లి: మండల పరిదిలోని నిడ్జింత గ్రామంలోని ఓ పెంకుటిల్లు వర్షానికి కూలిపోయింది. రెండు రోజులుగా ముసురు వర్షం కురవడంతో కొల్లంపల్లి దేవమ్మకు చెందిన పెంకుటిల్లు గోడ కూలింది. కూలిన సమయంలో ఇంట్లో భార్యాభర్తలు కుమారులతో ఇంట్లో లోపలి భాగంలో పడుకోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాల వితరణ



మరికల్: మండల కేంద్రంలోని సరస్వతీ దేవి ఆలయంలోని హుండీ ఇటీవల పట్ట పగలే చోరీకి గురైంది. దీంతో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి స్పందించి గురువారం ఆలయ కమిటీ సభ్యులకు సీసీ కెమెరాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరు ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో పూజారి శివప్రసాద్, దూబాయ రాములు, కొండారెడ్డి, తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, హన్మంతు, సంతోష్, శ్రీనివాస్, అశోక్, నాగేష్‌లు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే పంటల సంరక్షణ



దామరగిద్దలో పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

- మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం
- పంటలను ఆశిస్తున్న చీడపీడలు
- మందుల పిచికారీలో రైతన్నలు

దామరగిద్ద: వానాకాలంలో రైతులు సాగుచేసిన ప్రధాన పంటల్లో పత్తి, కంది, పెసర పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చీడపీడల ఉధృతి పెరిగిందని రైతన్నలు వాపోతున్నారు. మండలంలో 8 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో గత జూన్ మొదటి వారంలో పెసర, పత్తి, కంది పంటలను సాగు చేశారు. మండలం మొత్తంగా 39 వేల ఎకరాల సాగు భూమి ఉండగా అత్యధికంగా 16520 ఎకరాల్లో కంది సాగు చేపట్టారు. ఇక వరి దాదాపు 15600 ఎకరాల్లో సాగు అవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. పత్తి 5600 ఎకరాలకు పరిమితమైంది. పెసర పంట 4860 ఎకరాల్లో మినుము 380 ఎకరాల్లో, జొన్న 300 ఎకరాల్లో, చిరుధాన్యాలు 35 ఎకరాల్లో కూరగాయ పంటలు 110 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు 350 ఎకరాల్లో సాగవుతున్నాయి.

పంటలను ఆశిస్తున్న చీడపీడలు

పెసర పంటను ఆశిస్తున్న తెల్లదోమ, పేనుబంక,



పెసర పంటకు ఆశించిన పచ్చ వైరస్ (ఫైల్)

రసం పీల్చే పురుగులు జీడ తెగులు, మరక మచ్చ పురుగు వంటివి పంట దశ 30 రోజుల నుంచి గింజ పట్టే దశ వరకు ఎక్కువగా ఆశిస్తుంటాయి. వీటి నివారణకు క్వినాల్‌పాస్, లీటర్ నీటికి 1 ఎంఎల్ లేదా క్లోరిపైరిపాస్ లేదా మోనోక్రోటపాస్ 2.5 ఎంఎల్ లేదా ఇమిడిక్లోప్రైడ్, అసిపేట్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. వీటితో పాటు వేప నూనే 5 ఎంఎల్ ఒకలీటరు నీటిలో కలిపి పంటలపై చల్లితే చీడపీడలను నివారించవచ్చు. కాయతొలిచే మరుక మచ్చల పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోట్ మందును ఎకరాకు 60 నుంచి 80 గ్రామాల చొప్పున 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. పత్తిలో ఫ్లోనికామైడ్ లేదా ఇమిడాక్లోప్రైడ్‌తో పాటు ప్రథమ పోషకాలను అందించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పించాలి

వానకాలం సాగు చేసిన పెసర, పత్తి పంటలకు చీడపీడల ఉధృతి అధికంగా ఉంది. అప్పు చేసి పంటల సాగు చేపట్టడంతో చీడపీడలతో నష్టాలు తప్పడం లేదు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులను అవగాహన కల్పించాలి. గ్రామాల్లో సీజన్‌లో వేసిన పంటలకు సోకుతున్న చీడపీడలు, పురుగుల నివారణకు ఎలాంటి మందులు పిచికారి చేయాలో చెబితే రైతులకు అంతో ఇంతో మేలు జరుగుతుంది.

–కుర్వ బాల్‌రాజ్, రైతు, మద్దెల్‌బీడ్

అధికారుల సూచనలు పాటించాలి



వరుసగా కురుస్తున్న వర్షాలతో పంటలకు చీడపీడలు వ్యాప్తి అధికంగా ఉంటుంది. పెసర పంటకు జీడ, మరుక మచ్చల పురుగు పత్తిలో పేనుబంక, నల్లి, తెల్లదోమ పచ్చదోమ ఆశించి నష్టపరుస్తున్నాయి. పంట సాగులో అప్రమత్తంగా ఉండి చీడపీడల గుర్తించి వెంటనే మందులు పిచికారి చేసుకోవడం మంచిది. పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏఏ మందులు ఎంత మోతాదులో పిచికారి చేయాలో స్థానిక ఏఈఓను సంప్రదించి సలహాలు తీసుకొని పాటిస్తే నష్టాలు రాకుండా చూసుకోవచ్చు.

–మణిచందర్, మండల వ్యవసాయ అధికారి, దామరగిద్ద

ట్రైనీ కలెక్టర్ ప్రభుత్వ పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్

ఊట్కూరు: మండలంలోని జీపీఎస్ పాఠశాలను గురువారం ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అలాగే సీపీఎస్ పాఠశాలలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించగా గదిలో చీకటిగా ఉండడంతో వెలుతురు, గాలి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివేకనందా చౌరస్తాలో డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడం వల్ల మురుగునీరు రోడ్ల పైనుంచి పారుతుందని స్థానికులు ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులును ఆదేశించారు. గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ అర్హులకు మంజూరు చేయడం లేదని బీఎస్పీ మండల అధ్యక్షుడు గౌతమ్ ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ఎంపీఓ లక్ష్మినర్సింహరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల కోసం మహిళల నిరసన



కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మద్దూరు: ప్రభుత్వం నుంచి మైనార్టీ మహిళలకు మంజూరైన కుట్టు మిషన్లను ఇవ్వకుండా అధికార పార్టీ మైనార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ గురువారం మద్దూరు పుర కార్యాలయంలో రెనివట్ల ముస్లిం మహిళలు ప్రొసీడింగ్‌లతో వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఉచితంగా మంజూరైన కుట్టుమిషన్లను నాయకులు డబ్బులు ఇచ్చిన వారికి అందజేశారని ఆరోపించారు. ఈ క్రమంలో మైనార్టీ నాయకుడు యాసిన్ అక్కడి చేరుకొని మహిళలతో కలిసి కమిషన్ కార్యాలయంలో గొడవకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న కమిషనర్ శ్రీకాంత్ మున్సిపాలిటీకి మొత్తం 243 కుట్టు మిషన్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 208 పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని మైనార్టీ కార్పొరేషన్ నుంచి వచ్చిన లిస్టులో పేరున్న వారిని పిలిచి అందజేస్తామనడంతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



మరికల్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



మక్తల్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

- కోస్గిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటనర్సింలు , సాయిలు , పోశప్ప, నరేందర్‌రెడ్డి , మోహన్ , సాయిలు, రాజు మధుసూధన్ , ఈశ్వరయ్య జనార్దన్ తదితరులు ఉన్నారు.
- మద్దూరులో మండల బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
- మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నివాసంలో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు శ్రీపడమటి అంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాసు, రాజుల ఆశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు
- మాగనూర్‌లో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయాకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన వస్తుందని జోస్యం చెప్పారు.
- మరికల్‌లో మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రామస్వామి, బసంత్, సంపత్, రవి పాల్గొన్నారు.
- కొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచుకొని టపాకాయలు కాల్చారు.

ఏపీ జల దోపిడీపై ప్రభుత్వం స్పందించాలి

కోస్గి రూరల్: తెలంగాణకు రావాల్సిన వాటాలో ఏపీ జల దోపిడీకి పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపడం లేదని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కోట్ల మహిపాల్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు జలదోపిడీపై అవగాహన కల్పించారు. కేసీఆర్ హయాంలో నీళ్లు , నిధులు నియామకాలపై ఉద్యమం నిర్వహిస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి 200 వందల టీఎంసీల నీటిని అక్రమంగా తరలించే కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. ఈ కుట్రలను అడ్డుకునేందుకు పెద్దఎత్తున బీఆర్ఎస్ నిరసన ర్యాలీలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్ ,బాల్‌రాజ్ , కేశవులు, గోపాల్, సురేష్, వెంకటనర్సింలు ,సాయప్ప, శ్రీను పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన




కొత్తపల్లి: మండల పరిధిలోని మన్నాపూర్–అల్లీపూర్ గ్రామాల మధ్యలో వాగుపై రూ.8 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ అధికారులు అల్లీపూర్ మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు ఉధృతంగా పారే అవకాశం ఉంది. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అంతరాయం కలగకుండా మధ్యలో ఉన్న పిల్లర్లను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను సూచించారు.

మోడల్ స్కూల్‌లో ఎలాంటి ఇబ్బందులు లేవు

ధన్వాడ: మండలంలోని మోడల్ పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రిన్సిపల్ ఉమాయి ఆఫ్రా పేర్కొన్నారు. ఇటీవల స్నానపు గదులు, శౌచలయాలు సరిగా లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పత్రికలో వార్తలు రావడంపై ఆమె స్పందించారు. ఆ ఫోటోలు తమ పాఠశాలకు చెందినవి కాదని గర్ల్స్ హస్టల్‌కు సంబంధించినవి అని తెలిపారు. హాస్టల్ మెయింటెనెన్స్ తమ పరిధిలోకి రాదని కేజీబీవీ పాఠశాల పరిధిలోకి వస్తుందన్నారు.

శ్యాసన్ పల్లిలో 'జన్ సురక్ష క్యాంప్'



నారాయణపేట రూరల్: పట్టణంలోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో శ్యాసన్ పల్లి గ్రామంలో గురువారం జన్ సురక్ష క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ కౌన్సిలర్లు అనసూయ, వెంకటేష్ పీఎం సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీమా పాలసీని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బడిలోకి నీళ్లు.. విద్యార్థులకు తిప్పలు

మండలంలోని పస్పుల ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోకి మళ్లీ వర్షపు నీరు చేరడంతో బడి చెరువును తలపిస్తుంది. గత నెలలో కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు నిలవడంతో విద్యార్థులు అలాగే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మళ్లీ పాఠశాల ప్రాంగణం మొత్తం నీరు నిలవడంతో విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటితో విషజ్వరాలు కూడా ప్రబలే అవకాశం ఉందని అధికారులు స్పందించి పాఠశాల చుట్టు డ్రెయినేజీ ఏర్పాటు చేసి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - మరికల్



చెరువు కాదు.. ప్రయాణ ప్రాంగణం

ఈ చిత్రాన్ని చూసి ఏదో గ్రామ శివారులోని చెరువు అనుకున్నారా.. కాదండి బాబు.. ఇది జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బస్టాండ్‌లోని మక్తల్, హైదరాబాద్ ప్లాట్ ఫాం వెనుక భాగంలో నీరు నిలిచిపోవడంతో ఇలా చెరువును తలపిస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ సరైన రీతిలో సీసీ పనులు చేయకపోవడంతో గుంతలాగా ఏర్పడి వర్షం కురిసిన ప్రతిసారి నీళ్లు నిలుస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు కూడా చూసీ చూడనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. వెంటనే నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - నారాయణపేట రూరల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్/ నారాయణపేట టౌన్: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జీవో నెంబర్ 25ను సవరించి 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింప చేయాలన్నారు. జీఓ 317 వల్ల స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు వారి సొంత జిల్లాలకు పంపాలని డిమాండ్ చేశారు. బదిలీలతో పాటు జీహెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, పీఎస్‌హెచ్ఎం పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, రెడ్డప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

దామరగిద్ద: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు బాలాజీ, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులకు పెన్షన్ బెనిఫిట్స్ విడుదల చేయాలని పీఆర్‌సీ అమలు చేయాలని సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: కాళబెళగుండె బసవేశ్వర స్వామి దేవాలయంలో గురువారం అమావాస్య పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నియామవాళి, శాస్వీత రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, అలంకరణ చేపట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామ శివారులోని లక్ష్మమ్మ మాతా పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పల్లకిని మోసుకొని ఆలయానికి తీసుకెళ్లారు.

నర్వ: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దకడ్మూర్, నర్వలో శివాలయాల్లో స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన పూజలు జరిపించారు. అనంతరం స్వామి వారి చిత్రపటంతో పల్లకి సేవ నిర్వహించి ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేపట్టారు.

మక్తల్: పట్టణంలోని ప్రముఖ దేవాలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వీరభద్ర దేవాలయంలో మక్తల్‌కు చెందిన కుర్వ వెంకటేష్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాత్కాలిక వంతెన పనులు ముమ్మరం



వంతెన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కొత్తపల్లి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిడ్జింత వాగులోకి నీరు చేరడంతో వాగుపై ఏర్పాటు చేసిన రోడ్డు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఆర్‌అండ్‌బీ డీఈ రాములు వాగు దగ్గరకు చేరుకొని తాత్కాలికంగా వంతెన పనులు ముమ్మరం చేశారు. వరద నీరు వెళ్లేందుకు పైపులను ఏర్పాటు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరితగతిన వినియోగంలోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోరా..?



ప్రమాదకరంగా ఉన్న మలుపు

మాగనూర్: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా అధికారుల అలసత్వంతో పలు రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండల పరిధిలోని వాడ్వట్ నుంచి మందిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో మలుపులు ఉండడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ రోడ్డును తవ్వేస్తున్నారు. వీటితో కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.